रजिस्ट्री सं डी--२२१
Registered No. D-221
రిజిస్ట్రీ సంఖ్య డి--221

[PRICE : Rs: 5.00 Paise
మూల్యము: రూ. 5.00 పైసలు

# भारत का राजपत्र
# The Gazette of India
# భారత రాజపత్రము

असाधारण
**EXTRAORDINARY**
అసాధారణ

भाग XVI अनुभाग 1
**Part XVI Section 1**
భాగము XVI అనుభాగము 1

प्राधिकार से प्रकाशित
**PUBLISHED BY AUTHORITY**
ప్రాధికారము ద్వారా ప్రచురించబడినది

| | | | | |
|---|---|---|---|---|
| सं ३ | नई दिल्ली | सोमवार | ९ अगस्त, १९९३ / १८ श्रावण, १९१५ शक | खंड ८ |
| No. 3 | New Delhi | Monday | 9th August, 1993 / 18th Sravanam, 1915 Saka | Vol. 8 |
| సంఖ్య 3 | న్యూఢిల్లీ | సోమవారము | 9 ఆగస్టు, 1993 / 18 శ్రావణం, 1915 శక | సంపుటము 8 |

## MINISTRY OF LAW AND JUSTICE

## LEGISLATIVE DEPARTMENT

New Delhi, 28th July, 1993/6th Sravanam, 1915 Saka

The translations in Telugu of the following, namely :-

(1) The Cooperative Societies Act, 1912 (Act 2 of 1912); (2) The Societies Registration Act, 1860 (Act 21 of 1860); (3) The Handlooms (Reservation of Articles for Production) Act, 1985 (Act 22 of 1985); (4) The Carriers Act. 1865 (Act 3 of 1865); (5) The Explosives Act, 1884 (Act 4 of 1884) and (6) The Disturbed Areas (Special Courts) Act, 1976 (Act 77 of 1976) are hereby published under the authority of the President and shall be deemed to be the Authoritative Texts thereof in Telugu under Clause (a) of Section 2 of the Authoritative Texts ( Central Laws) Act, 1973 (Act 50 of 1973).

శాసన మరియు న్యాయపాలన మంత్రిత్వ శాఖ

(శాసన నిర్మాణ విభాగము)

న్యూఢిల్లీ, 22 జూలై, 1993/6 శ్రావణం, 1915 శక

ఈ క్రింది చట్టములు అనగా :--

(1) ది కోపరేటివ్ సొసైటీస్ యాక్టు, 1912 (1912 లోని 2వ చట్టము); (2) ది సొసైటీస్ రిజిస్ట్రేషన్ యాక్టు, 1860 (1860 లోని 21వ చట్టము); (3) ది హ్యాండ్‌లూమ్స్ (రిజర్వేషన్ ఆఫ్ ఆర్టికల్స్ ఫర్ ప్రొడక్షన్) యాక్టు, 1985 (1985 లోని 22వ చట్టము); (4) ది క్యారియర్స్ యాక్టు, 1865 (1865 లోని 3వ చట్టము); (5) ది ఎక్స్‌ప్లోజివ్స్ యాక్టు, 1884 (1884 లోని 4వ చట్టము) మరియు (6) ది డిస్టర్బ్డ్ ఏరియాస్ (స్పెషల్ కోర్ట్స్) యాక్టు, 1976 (1976 లోని 77వ చట్టము)ల యొక్క తెలుగు అనువాదములను రాష్ట్రపతి ప్రాధికారము క్రింద ఇందుమూలముగా ప్రచురించడమైనది. ఈ అనువాదములను ఆ చట్టములకు, ప్రాధికృత పాఠముల (కేంద్ర శాసనముల) చట్టము, 1973 (1973 లోని 50వ చట్టము) యొక్క 2వ పరిచ్ఛేదములోని ఖండము (ఏ) క్రింద ప్రాధికృత తెలుగు పాఠములైనట్లు భావించవలెను.

# పేలుడు వస్తువుల చట్టము, 1884

(1884 లోని 4వ చట్టము)

(26 ఫిబ్రవరి, 1884)

పేలుడు వస్తువుల తయారీని, స్వాధీనమును, వాడుకను, విక్రయమును, రవాణాను, ఎగుమతి, దిగుమతులను క్రమబద్ధం చేయడానికైన చట్టము.

పేలుడు వస్తువుల తయారీని, స్వాధీనమును, వాడుకను, విక్రయమును, రవాణాను దిగుమతిని క్రమబద్ధం చేయుట ఉపయుక్తమైనందున ఇందుమూలంగ ఈ క్రింది విధంగా శాసనము చేయడమైనది:-

1. (1) ఈ చట్టాన్ని పేలుడు వస్తువుల చట్టము, 1884 అని పేర్కొన వచ్చును; మరియు సంగ్రహనామ

(2) ఇది యావద్భారత దేశానికి విస్తరించును.

2. (1) ఈ చట్టము కేంద్ర ప్రభుత్వము రాజపత్రంలో అధిసూచన ద్వారా నియతము చేయునట్టి దినమున అమలులోనికి వచ్చును. స్థానిక విస్త ప్రారంభము.

3. x x x x x x xx

4. ఈ చట్టములో సందర్భాన్నిబట్టి అర్థం వేరుగా ఉన్ననే తప్ప- నిర్వచనముల

(ఏ) 'వాయుయానము' అనగా, వాయుమండలంలో భూమి ఉపరితలంపై నున్న వాయు ప్రతిక్రియలు కానట్టి వాయు ప్రతిక్రియల నుండి ఆలంబనము పొందు ఏదేని యంత్రము అని అర్థము; ఈ పదపరిధిలో నిలకడగా ఉన్నవైనను లేనివైనను బెలూన్‌లు, గాలిఓడలు, గాలిపటాలు, గ్లయిడర్లు, ఎగురే యంత్రాలు చేరియుండును;

(బీ) "బండి" అను పదపరిధిలో ఏదేని బండి, వ్యాగను, శకటం, ట్రక్కు, వాహనము లేక అది ఏ రీతిగా నడిపెడిదైనను భూమార్గాన సరుకులను గాని ప్రయాణీకులను గాని తీసుకొనిపోవు సాధనము చేరియుండును;

(సీ) ఏ ప్రాంతానికి ఒక పోలీసు కమీషనరును నియమించడం జరిగిందో, ఆ ప్రాంతం విషయంలో "జిల్లా మేజిస్ట్రేటు" అనగా ఆ ప్రాంతపు పోలీసు కమీషనరు అని అర్థము; ఈ పదపరిధిలో-

(ఏ) అట్టి మొత్తం ప్రాంతముపై గాని అందలి ఏదేని భాగంపై గాని అధికారితను వినియోగించుచున్నట్టి, ఆ ప్రాంతం లేక భాగం విషయంలో రాజ్య ప్రభుత్వం ఈ విషయంలో నిర్దిష్టపరచునట్టి ఎవరేని డిప్యూటీ పోలీసు కమీషనరు; మరియు

(బీ) అదనపు జిల్లా మేజిస్ట్రేటు,

చేరియుండును.

(డీ) "ప్రేలుడు వస్తువు" అనగా, తుపాకిమందు, నైట్రోగ్లిసరిన్, నైట్రోగ్లికోల్, గన్‌కాటన్, డైనైట్రోటోల్యునె, ట్రైనైట్రోటొల్యునె, పికరిక్ ఆసిడ్, డైనైట్రోఫినాల్, ట్రైనైట్రోరిసోర్సినోల్ (స్టైఫినిక్ ఆసిడ్) సైక్లో ట్రైమిథలిన్ – ట్రైనైట్రోమైన్, పెంటా ఇరిత్రిటోల్ టెట్రానైట్రేట్, టెట్రిల్, నైట్రోగానిడైన్, లెడ్ అజైడ్, లెడ్ స్టైఫ్నేట్, పాదరసము లేక ఇతర ధాతువు యొక్క ఫల్మినేట్, డయాజోడినైట్రోఫినాల్, రంగుల బాణాసంచా, లేక ప్రేలుడు ద్వారా వాస్తవమైన ప్రభావం లేక బాణాసంచా కాల్చి అగ్నిక్రీడ ప్రభావాన్ని కలిగించు ఉద్దేశంతో ఉపయోగించిన లేక తయారుచేసిన ఏదేని ఇతర పదార్థం అది ఒకే రసాయనిక పదార్థమైనను పదార్థాల మిశ్రమమైనను సరే, ఘనపదార్థమైనను ద్రవపదార్థమైనను వాయు పదార్థమైనను సరే – అని అర్థము; ఈ పదపరిధిలో పొగమంచు సంకేతాలు, బాణాసంచా, ఫ్యూజులు, రాకెట్లు, పెర్కుసన్ క్యాపులు, డిటోనేటర్లు, తూటాలు, అన్ని రకాల మందుగుండు సామగ్రి మరియు ఈ ఖండంలో నిర్వచించిన ప్రేలుడు వస్తువు యొక్క ప్రతియొక అనుకూలనము లేక తయారీ చేరియుండును.

(ఈ) "ఎగుమతి" అనగా భూమార్గమున గాని, సముద్రమార్గమున గాని వాయుమార్గమున గాని భారతదేశం నుండి భారతదేశం వెలుపలగల స్థలానికి తీసుకొనిపోవుట అని అర్థము;

(యఫ్) "దిగుమతి" అనగా భూమార్గమునగాని, సముద్ర మార్గమున గాని, వాయుమార్గమున గాని భారతదేశం వెలుపలగల ఒక స్థలం నుండి భారత దేశంలోనికి తీసుకొనివచ్చుట అని అర్థము;

(జీ) "మాస్టర్" అనగా–

(ఏ) ఏదేని జలయానము లేక వాయుయానము విషయంలో, పైలట్, హార్బరు మాస్టరు, అసిస్టెంటు హార్బరు మాస్టరు లేక బెర్తింగ్ మాస్టరుకానట్టి తత్సమయమున ఆ జలయానము లేక సందర్భానుసారంగా, వాయుయానము యొక్క బాధ్యత లేక నియంత్రణ కలిగియున్నట్టి ఎవరేని వ్యక్తి అని అర్థము; మరియు

(బీ) ఒక ఓడకు చెందిన ఏదేని పడవ విషయంలో, ఆ ఓడ యొక్క మాస్టరు అని అర్థము;

(హెచ్) ఒక ప్రేలుడు వస్తువు విషయంలో "తయారీ" అను పదపరిధిలో–

(1) ప్రేలుడు వస్తువును సంఘటక భాగములుగ విభజించు లేక ఇతర విధంగా విడగొట్టు, లేక ప్రేలుడు వస్తువును విఘటితంచేయు లేక ఏదైన చెడిపోయిన ప్రేలుడు వస్తువును వాడదగినదిగా చేయు ప్రక్రియ; మరియు

(2) ప్రేలుడు వస్తువును తిరిగి తయారుచేయు, పరివర్తనం చేయు, లేక మరమ్మత్తు చేయు ప్రక్రియ

చేరియుండును;

(ఐ) "విహిత" అనగా ఈ చట్టము క్రింద చేసిన నియమాల ద్వారా విహితపరచిన అని అర్థము;

(జే) "జలయానము" అను పదపరిధిలో తెడ్లతో నడిపెడిదైనను, ఇతర విధంగా నడిపెడిదైనను ఏదేని ఓడ, పడవ, తెరచాప సహాయంతో నడచు జలయానము లేక నౌకాపరివహనములో ఉపయోగించెడి ఇతర రకపు జలయానము మరియు

మనుష్యులను, సరుకులను, ప్రధానంగా జలమార్గమున చేరవేయడానికి తయారు చేసినదైనను మరియు కేసన్ చేరియుండును.

5. (1) కేంద్ర ప్రభుత్వము భారతదేశము నందలి ఏ భాగం కొరకైనను, పేలుడు వస్తువుల, లేక ఏదైన నిర్దిష్ట వర్గపు పేలుడు వస్తువుల తయారీని, స్వాధీనమును, వాడుకను, విక్రయమును, రవాణాను, మరియు దిగుమతిని ఆ నియమాల ద్వారా నిబంధించినట్లు మంజూరుచేసిన లైసెన్సు క్రింద మరియు ఆ లైసెన్సు షరతుల ప్రకారం తప్ప, క్రమబద్ధం చేయడానికిగాని నిషేధించడానికిగాని, ఈ చట్టానికి అనుగుణంగా ఉండే నియమాలను చేసి నిబంధనలు చేయవచ్చును.

పేలుడు వస్తువుల తయారీకి, స్వాధీనమునకు, వాడుకకు, విక్రయమునకు, రవాణా మరియు దిగుమతి చేయుటకొరకు లైసెన్సుల నిచ్చుటను గూర్చి నియమాలు చేయు అధికారము.

(2) ఈ పరిచ్ఛేదం క్రింది నియమాలలో, ఇతర విషయాలతో పాటు ఈ క్రింది విషయాలన్నింటి కొరకైనను, లేక వాటిలో వేటికొరకైనను నిబంధనలు చేయ వచ్చును, అవి ఏవనగా:-

(ఏ) లైసెన్సులను ఏ ప్రాధికారి మంజూరు చేయవచ్చును:

(బీ) లైసెన్సుల కొరకు విధించవలసిన ఫీజు, మరియు దరఖాస్తు దారులు లైసెన్సుల కొరకును ఖర్చులకు గాను చెల్లించవలసిన ఇతర పైకములు (ఏవైనా ఉన్నచో) ఆ పైకములు;

(సీ) లైసెన్సుల కొరకు దరఖాస్తులు పెట్టుకొనవలసిన రీతి, మరియు అట్టి దరఖాస్తులలో నిర్దిష్టపరచవలసిన విషయాలు;

(డీ) లైసెన్సులు ఏ ప్రరూపంలో ఏ షరతులపై మరియు ఏ షరతులకు లోబడి మంజూరు చేయవలెనో ఆ ప్రరూపం మరియు ఆ షరతులు;

(ఈ) లైసెన్సులు అమలులో ఉండవలసిన కాలావధి;

(ఈఈ) పరిచ్ఛేదం 6-ఎఫ్ క్రింద అపీళ్లు ఏ ప్రాధికారికి పెట్టుకొన వచ్చునో ఆ ప్రాధికారి, అట్టి ప్రాధికారి అనుసరించవలసిన ప్రక్రియ, అపీళ్లు పెట్టుకొనవలసిన కాలావధి అట్టి అపీళ్ల విషయంలో చెల్లించవలసిన ఫీజు; మరియు అట్టి ఫీజు వాపసు చేయదగు పరిస్థితులు;

(ఈఈఏ) లైసెన్సుదారు ఒక నిర్దిష్ట కాలావధిలో ఎంత మొత్తం పరిమాణములో పేలుడు వస్తువులను కొనుగోలు చేయవచ్చునో ఆ మొత్తం పరిమాణము;

(ఈఈబీ) పేలుడు వస్తువుల తయారీ, రవాణా, ఎగుమతి లేక దిగుమతులకు సంబంధించి చేసిన సేవలకుగాను, పేలుడు వస్తువుల ముఖ్య నియంత్రకుడు (చీఫ్ కంట్రోలరు) లేక ఈ విషయంలో అతడు ప్రాధికారమొసగిన ఎవరేని అధికారి విధించవలసిన ఫీజు;

(యఫ్) నియమాల అమలు నుండి, ఏవేని పేలుడు వస్తువులను, లేక ఎవరేని వ్యక్తిని, లేక ఏదేని వర్గపు వ్యక్తులను, పూర్తిగా గాని, షరతులకు లోబరచిగాని మినహాయించుట;

కొన్ని ప్రేలుడు వస్తువుల విషయంలో ఇది వరకే వర్తకం చేయుచున్న వ్యక్తులు లైసెన్సు లేకుండా, కొంత కాలం వరకు అట్టి వర్తకాన్ని కొనసాగించుట.

5–ఏ. 5వ పరిచ్ఛేదంలో గాని దాని క్రింద చేసిన నియమాలలో గాని ఏమి యున్నప్పటికిని, భారత ప్రేలుడు వస్తువుల (సవరణ) చట్టము, 1978 ప్రారంభ మగుటకు అవ్యవహితపూర్వం ఎవరేని వ్యక్తి, భారత ప్రేలుడు వస్తువుల (సవరణ) చట్టము, 1978 ద్వారా సవరింపబడుటకు పూర్వం ఈ చట్టము క్రింద లైసెన్సు అవసరంలేనట్టి ఏవేని ప్రేలుడు వస్తువుల తయారు, విక్రయం, రవాణా, ఎగుమతి లేక దిగుమతిచేసెడి వర్తకాన్ని సాగించుచుండినయెడల, అప్పుడు, ఆ వ్యక్తి అట్టి ప్రేలుడు వస్తువు విషయంలో లైసెన్సు లేకుండా--

(ఏ) అట్టి ప్రారంభపు తేదీ నుండి మూడు మాసముల కాలావధి వరకు; లేక

(బీ) ఆ మూడు మాసాల కాలావధి ముగియడానికి ముందు అట్టి ప్రేలుడు వస్తువుల వర్తకం కొరకై ఈ చట్టము క్రింద లైసెన్సు మంజూరుకై అట్టి వ్యక్తి దరఖాస్తు పెట్టుకొనినచో, అట్టి దరఖాస్తు అంతిమంగా పరిష్కారమగు వరకు, వీటిలో ఏది తరువాత అగునో, అంతవరకు,--

అట్టి వర్తకాన్ని కొనసాగించడానికి హక్కు కలిగివుండును.

ప్రత్యేకంగా అపాయకరమైన ప్రేలుడు వస్తువుల తయారీని, స్వాధీనమును, లేక దిగుమతిని నిషేధించడానికి కేంద్ర ప్రభుత్వాధికారము.

6. (1) పై కడపటి పరిచ్ఛేదం క్రింద నియమాలలో ఏమియున్నప్పటికిని, కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు రాజపత్రంలో అధిసూచన ద్వారా--

(ఏ) కేంద్ర ప్రభుత్వం అభిప్రాయంలో ప్రజా భద్రత కొరకై ఆ అధిసూచన జారీచేయుట ఉపయుక్తమగునంతటి అపాయకరమైన ఏదేని ప్రేలుడు వస్తువు యొక్క తయారీని, స్వాధీనమును లేక దిగుమతిని పూర్తిగా గాని షరతులకు లోబరచిగాని నిషేధించవచ్చును.

x x x x x x x x x x

(2) ఈ పరిచ్ఛేదం క్రింద ఏ ప్రేలుడు వస్తువు దిగుమతిని గురించి ఒక అధిసూచన జారీచేయడం జరిగిందో అట్టి ఏదేని ప్రేలుడు వస్తువు మరియు అట్టి వస్తువు కలిగియున్న జలయానము, బండి లేక వాయుయానము విషయంలో కస్టమ్స్ చట్టము, 1962 (1962లో 52) ఆ చట్టము క్రింద దిగుమతిని నిషేధించిన లేక క్రమబద్ధం చేసిన వస్తువు మరియు అట్టి వస్తువును కలిగియున్న జలయానము, బండి లేక వాయుయానము విషయంలో వలెనే, ప్రభావం కలిగి యుండును.

తరుణ వ్యక్తులు మరియు కొందరు ఇతర వ్యక్తులు ప్రేలుడు వస్తువులను తయారు చేయుటను, స్వాధీనము నందుంచుకొనుటను, విక్రయించుటను లేక రవాణాచేయుటను నిషేధించుట.

6–ఏ. ఈ చట్టమునందలి పై నిబంధనలలో ఏమియున్నప్పటికిని--

(ఏ) (i) పదునెనిమిది సంవత్సరాల వయస్సు నిండని ఏ వ్యక్తియు, లేక

(ii) హింసాకాండలో గాని లేక నైతికబాహ్యతతోగాని, కూడియున్న ఏదేని అపరాధమునకై దోషస్థాపన జరిగిన మీదట ఆరుమాసాలకు తక్కువకాని కాలావధికి కారావాస శిక్ష విధింపబడిన, ఏ వ్యక్తియు – ఆ కారావాస శిక్ష ముగిసిన తరువాత అయిదు సంవత్సరాల కాలావధి లోపల ఎప్పుడైనను – లేక

(iii) శాంతియుతంగా లేక సత్ప్రవర్తనతో మెలగుటకు క్రిమినలు ప్రక్రియా స్మృతి, 1973 (1974 లోని 2) యొక్క అధ్యాయము 8 క్రింద బాండు వ్రాసి ఇచ్చుటకు ఉత్తరువు చేయబడిన ఏ వ్యక్తియు - ఆ బాండు కాలావధిలో ఎప్పుడైనను - లేక

(iv) భారత పేలుడు వస్తువుల (సవరణ) చట్టము, 1978 ప్రారంభ మగుటకు పూర్వంగాని, తరువాత గాని ఈ చట్టము యొక్క లేక ఈ చట్టము క్రింద చేసిన నియమాల యొక్క నిబంధనలను ఉల్లంఘించినందులకు ఈ చట్టము క్రింద లైసెన్సు రద్దుచేయబడిన ఏ వ్యక్తియు - అట్టి లైసెన్సు రద్దైన తేదీ నుండి అయిదు సంవత్సరాల కాలావధి లోపల ఎప్పుడైనను -

(1) ఎట్టి పేలుడు వస్తువును గాని తయారుచేయరాదు, విక్రయించరాదు, రవాణా, దిగుమతి లేక ఎగుమతి చేయరాదు; లేక

(2) కేంద్ర ప్రభుత్వం, రాజపత్రంలో అధిసూచన ద్వారా స్వభావాన్ని బట్టి నిర్దిష్టపరచు ఏదేని పేలుడు వస్తువును స్వాధీనము నందుంచుకొనరాదు;

(బీ) ఏ వ్యక్తియు, ఏదేని పేలుడు వస్తువును ఎవరేని వ్యక్తికి విక్రయించు అందజేయు లేక పంపు సమయమున, ఆ వ్యక్తి-

(i) అట్టి పేలుడు వస్తువును తయారుచేయుటకు, విక్రయించుటకు, రవాణా చేయుటకు, దిగుమతి చేయుటకు, ఎగుమతి చేయుటకు లేక స్వాధీనము నందుంచుకొనుటకు ఖండము (ఏ) క్రింద నిషేధింపబడినాడని, లేక

(ii) మతిస్థిమితం లేనివాడని,

తాను ఎరిగియున్నచో లేక అట్లు విశ్వసించుటకు తనకు కారణ మున్నచో ఆ వ్యక్తికి ఆ పేలుడు వస్తువును విక్రయించరాదు, అందజేయరాదు లేక పంపరాదు.

6-బీ. (1) 5వ పరిచ్ఛేదం క్రింద లైసెన్సు కొరకు ఒక వ్యక్తి దరఖాస్తు పెట్టుకొనినయెడల, ఆ పరిచ్ఛేదం క్రింద చేసిన నియమాలలో లైసెన్సులను మంజూరు కొరకు విహితపరచిన (ఈ చట్టములో ఇటు పిమ్మట లైసెన్సు ప్రాధికారి అని నిర్దేశించిన) ప్రాధికారి, ఏదైనా పరిశీలన జరుపుట అవశ్యమని తాను భావించినచో అట్టి పరిశీలనను జరిపిన తరువాత, ఈ చట్టమునందలి ఇతర నిబంధనలకు లోబడి, వ్రాతపూర్వకమైన ఉత్తరువు ద్వారా లైసెన్సును మంజూరు చేయవలెను లేదా దానిని నిరాకరించవలెను. లైసెన్సుల మంజూరు-

(2) (ఏ) లైసెన్సు పేలుడు వస్తువుల తయారీకొరకు కావలసియున్న యెడల, ఎవరికి ఆ లైసెన్సు కావలసియున్నదో ఆ వ్యక్తి-

(i) పేలుడు వస్తువుల తయారీలో సాంకేతిక పరిజ్ఞానం, మరియు అనుభవం కలిగియున్నాడని; లేక

(ii) అట్టి సాంకేతిక పరిజ్ఞానం కలిగియున్న వ్యక్తిని లేక వ్యక్తులను అతడు నియోగించినాడని లేక నియోగించడానికి వచనబద్ధుడైయున్నాడని లైసెన్సు ప్రాధికారి తృప్తిచెందినయెడల, లేక

(బీ) అది ఏదేని ఇతర ప్రయోజనం కొరకు కావలసియున్నయెడల, ఆ లైసెన్సు ఎవరికి కావలసియున్నదో ఆ వ్యక్తి దానిని పొందుటకు తగిన కారణ మున్నదని లైసెన్సు ప్రాధికారి తృప్తిచెందినయెడల,

లైసెన్సు ప్రాధికారి ఆ లైసెన్సును మంజూరు చేయవచ్చును.

లైసెన్సుల నిరాకరణ.

6–సీ. (1) పరిచ్ఛేదం 6బీలో ఏమియున్నప్పటికిని లైసెన్సు ప్రాధికారి ఈ క్రింది సందర్భాలలో లైసెన్సును నిరాకరించవచ్చును:–

(ఏ) అట్టి లైసెన్సు నిషిద్ధమైన ఏదేని ప్రేలుడు వస్తువు విషయంలో కావలసియున్నయెడల; లేక

(బీ) అట్టి లైసెన్సు కావలసియున్న వ్యక్తిని–

(i) ఏదేని ప్రేలుడు వస్తువును తయారుచేయుటకు, స్వాధీనము నందుంచుకొనుటకు, విక్రయించుటకు, రవాణా చేయుటకు, దిగుమతి చేయుటకు లేక ఎగుమతి చేయుటకు ఈ చట్టము ద్వారా లేక తత్సమయమున అమలునందున్న ఏదేని శాసనం ద్వారా నిషేధించడం జరిగిందని, లేక

(ii) మతిస్థిమితం లేనివాడని, లేక

(iii) ఈ చట్టము క్రింద లైసెన్సు కొరకు ఏదేని కారణం వలన అయోగ్యుడని

లైసెన్సు ప్రాధికారి విశ్వసించడానికి కారణమున్నయెడల, లేక

(సీ) ప్రజా శాంతిని కాపాడుటకు లేక ప్రజాభద్రత కొరకు అట్టి లైసెన్సును నిరాకరించవలెనని లైసెన్సు ప్రాధికారి భావించినయెడల,

(2) లైసెన్సు ప్రాధికారి ఎవరేని వ్యక్తికి లైసెన్సును మంజూరుచేయ నిరాకరించినయెడల, అట్టి నిరాకరణకు గల కారణాన్ని వ్రాసియుంచవలెను మరియు ఆ వ్యక్తి అడిగినప్పుడు, దాని సంక్షిప్త వివరణను ఇచ్చుట ప్రజాహితం దృష్ట్యా సరికాదని లైసెన్సు ప్రాధికారి అభిప్రాయపడిన ఏదేని సందర్భంలో తప్ప, అతనికి అట్టి వివరణను ఈయవలెను.

విహితపరచిన షరతులకు అదనంగా షరతులను విధించుటకు లైసెన్సు ప్రాధికారి సమర్థుడు.

6–డీ. పరిచ్ఛేదం 6–బీ క్రింద మంజూరు చేసిన లైసెన్సులో, విహితపరచిన షరతులకు అదనంగా, ఏదేని ప్రత్యేకమైన సందర్భంలో లైసెన్సు ప్రాధికారి ఆవశ్యకమని భావించునట్టి ఇతర షరతులు, ఉండవచ్చును.

లైసెన్సుల మార్పు, నిలుపుదల మరియు ప్రతిసంహరణ.

6–ఈ. (1) విహితపరచినట్టి షరతులు తప్ప, వేటికి లోబడి లైసెన్సు మంజూరు చేయడం జరిగిందో ఆ షరతులను లైసెన్సు ప్రాధికారి మార్చవచ్చును మరియు ఆ ప్రయోజనం కొరకై వ్రాతపూర్వకమైన నోటీసు ద్వారా ఆ నోటీసులో విహితపరచినట్టి గడువు లోపల ఆ లైసెన్సును తనకు ఇచ్చివేయుమని ఆ లైసెన్సు గల వ్యక్తిని కోరవచ్చును;

(2) లైసెన్సు ప్రాధికారి, ఆ లైసెన్సుగల వ్యక్తి దరఖాస్తు పెట్టుకొనిన మీదట కూడా, విహితపరచినట్టి షరతులను తప్ప, లైసెన్సు షరతులను మార్చవచ్చును.

(3) (ఏ) లైసెన్సుగల వ్యక్తిని ఏదేని పేలుడు వస్తువును తయారు చేయుటకు దానిని స్వాధీనమునందుంచుకొనుటకు, విక్రయించుటకు, రవాణా చేయుటకు, దిగుమతి లేక ఎగుమతి చేయుటకు ఈ చట్టము ద్వారా లేక తత్సమయమున అమలునందున్న ఏదేని ఇతర శాసనం ద్వారా నిషేధించడం జరిగిందని లేక అతడు మతిస్థిమితము లేనివాడని, లేక ఈ చట్టము క్రింద లైసెన్సు కొరకు ఏదేని కారణం వలన అయోగ్యుడని లైసెన్సు ప్రాధికారి తృప్తిచెందినచో; లేక

(బీ) ప్రజా శాంతిని కాపాడుటకు లేక ప్రజాభద్రత కొరకు లైసెన్సును నిలిపి ఉంచుట, లేక ప్రతిసంహరించుట ఆవశ్యకమని లైసెన్సు ప్రాధికారి భావించినచో; లేక

(సీ) ముఖ్యమైన సమాచారాన్ని దాచియుంచుట ద్వారా గాని లైసెన్సు కొరకు దరఖాస్తు పెట్టుకొనిన సమయమున, లైసెన్సుగల వ్యక్తి లేక అతని తరఫున ఎవరేని ఇతర వ్యక్తి అందజేసిన తప్పుడు సమాచారం ఆధారంగా గాని లైసెన్సు పొందినచో; లేక

(డీ) లైసెన్సు యొక్క ఏవేని షరతులను ఉల్లంఘించినచో; లేక

(ఈ) లైసెన్సును ఇచ్చివేయమని కోరుచు ఉపపరిచ్ఛేదం (1) క్రింద ఇచ్చిన నోటీసును లైసెన్సుగల వ్యక్తి పాటించనిచో;

లైసెన్సు ప్రాధికారి, వ్రాతపూర్వకమైన ఉత్తరువు ద్వారా, తాను సబబని భావించునట్టి కాలావధిపాటు ఆ లైసెన్సును నిలిపి వేయవచ్చును లేదా ప్రతిసంహరించవచ్చును.

(4) లైసెన్సుగల వ్యక్తి పెట్టుకొనిన దరఖాస్తుపై కూడా లైసెన్సు ప్రాధికారి లైసెన్సును ప్రతిసంహరించవచ్చును.

(5) లైసెన్సు ప్రాధికారి ఉపపరిచ్ఛేదం (1) క్రింద లైసెన్సు షరతులను మార్చుచు ఉత్తరువును, లేక ఉపపరిచ్ఛేదం (3) క్రింద లైసెన్సును నిలిపివేయుచు లేక ప్రతిసంహరించుచు ఉత్తరువును చేయునెడల, అందుకుగల కారణాలను ఆ అధికారి వ్రాసియుంచవలెను. మరియు లైసెన్సుగల వ్యక్తి అడిగినపుడు, దాని సంక్షిప్త వివరణను ఇచ్చుట ప్రజాహితం దృష్ట్యా సరికాదని లైసెన్సు ప్రాధికారి అభిప్రాయపడిన ఏదేని సందర్భంలో తప్ప, అతనికి అట్టి వివరణను ఈయవలెను.

(6) లైసెన్సుగల వ్యక్తిపై, ఈ చట్టము క్రింద గాని, ఈ చట్టము క్రింద చేసిన ఏవేని నియమాల క్రింద గాని ఏదేని అపరాధమునకై దోషస్థాపన చేయు న్యాయస్థానము లైసెన్సును కూడ నిలిపివేయవచ్చును, లేక ప్రతిసంహరించవచ్చును:

అయితే అపీలులోగాని లేక అన్యథాగాని దోషస్థాపన త్రోసిపుచ్చబడినచో, ఆ నిలిపివేత, లేక ప్రతిసంహరణ చెల్లనిదగును.

(7) ఉపపరిచ్ఛేదం (6) క్రింద నిలిపివేత ఉత్తరువును, లేక ప్రతిసంహరణ ఉత్తరువును అపీలు న్యాయస్థానము లేక పునరీక్షణ అధికారాలను వినియోగించుచు ఉన్నత న్యాయస్థానము కూడ చేయవచ్చును.

(8) కేంద్ర ప్రభుత్వం, భారతదేశమునందంతట గాని, లేక అందలి ఏదేని భాగమునందు గాని ఈ చట్టము క్రింద మంజూరైన లైసెన్సు లన్నింటిని లేక వాటిలో ఏవేని లైసెన్సులను, రాజపత్రంలో ఉత్తరువు ద్వారా, నిలిపివేయవచ్చును లేక ప్రతిసంహరించవచ్చును లేక నిలిపివేయవలసినదిగా గాని ప్రతిసంహరించవలసినదిగా గాని ఎవరేని లైసెన్సు ప్రాధికారిని ఆదేశించవచ్చును.

(9) ఈ పరిచ్ఛేదం క్రింద ఒక లైసెన్సును నిలిపివేసిన మీదట, లేక ప్రతిసంహరించిన మీదట, దానిని కలిగియున్న వ్యక్తి దానిని ఎవరు నిలిపివేసినారో, లేక ప్రతిసంహరించినారో ఆ ప్రాధికారికి, లేక నిలిపివేత లేక ప్రతిసంహరణ ఉత్తరువులో ఈ విషయంతో నిర్దిష్టపరచినట్టి ఇతర ప్రాధికారికి ఆ లైసెన్సును జాప్యములేకుండ ఇచ్చివేయవలెను.

అప్పీళ్ళు. 6-యఫ్. (1) లైసెన్సును నిరాకరించుచు, లేక లైసెన్సు షరతులను మార్చుచు లైసెన్సు ప్రాధికారి చేసిన ఉత్తరువు వలన లేక లైసెన్సును నిలిపి వేయుచు లేక ప్రతిసంహరించుచు లైసెన్సు ప్రాధికారి చేసిన ఉత్తరువు వలన వ్యథితుడైన ఎవరేని వ్యక్తి ఆ ఉత్తరువుపై విహితపరచినట్టి (ఇందు ఇటు పిమ్మట అపీలు ప్రాధికారి అని నిర్దేశించిన) ప్రాధికారికి అట్టి కాలావధి లోపల అపీలు చేయవచ్చును:

అయితే, కేంద్ర ప్రభుత్వం చేసిన లేక ఆ ప్రభుత్వపు ఆదేశం క్రింద చేసిన ఉత్తరువుపై ఎట్టి అపీలు ఉండదు.

(2) అపీలుకొరకు విహితపరచిన కాలావధి ముగిసిన తరువాత అపీలు చేసినచో దానిని స్వీకరించరాదు:

అయితే, ఏదేని అపీలును దాని కొరకు విహితపరచిన కాలావధి లోపల చేయకుండుటకు తనకు తగిన కారణము కలదని అపీలుచేయు వ్యక్తి అపీలు ప్రాధికారిని తృప్తిపరచినచో ఆ అపీలును అట్టి కాలావధి ముగిసిన తరువాత స్వీకరించ వచ్చును.

(3) అపీలు కొరకు విహితపరచిన కాలావధిని, కాలపరిమితి చట్టము, 1963లో 36. 1963 క్రింద కాలపరిమితి అవధులను సంగణనచేయు విషయంలో ఆ చట్టములో గల నిబంధనల ననుసరించి సంగణన చేయవలెను.

(4) ఈ పరిచ్ఛేదం క్రింద ప్రతి అపీలును, వ్రాతపూర్వకమైన అర్జీ ద్వారా చేయవలెను. మరియు ఏ ఉత్తరువుపై అపీలు చేయడమైనదో ఆ ఉత్తరువుకు గల కారణముల సంక్షిప్త వివరణను అపీలుదారుకు ఇచ్చియున్నయెడల, అట్టి వివరణను మరియు విహితపరచినట్టి ఫీజును దానికి జతపరచవలెను.

(5) అపీలు ప్రాధికారి అపీలును పరిష్కరించుటలో విహితపరచినట్టి ప్రక్రియను అనుసరించవలెను:

అయితే ఏ అపీలును గాని, ఆకర్ణింపబడుటకు అపీలుదారుకు యుక్త మైన అవకాశము నిచ్చియున్ననే తప్ప, పరిష్కరించరాదు.

(6) అపీలు ప్రాధికారి షరతులతోగాని, షరతులు లేకుండా గాని అన్యథా ఆదేశించిననే తప్ప, ఏ ఉత్తరువుపై అపీలు చేయడమైనదో ఆ ఉత్తరువుపై అపీలు పరిష్కారమగులోగా ఆ ఉత్తరువు అమలులో ఉండును.

(7) ఏ ఉత్తరువుపై అపీలు చేయడమైనదో ఆ ఉత్తరువును ఖాయపరచుచు మార్పుచేయుచు లేక విపర్యస్తము చేయుచు అపీలు ప్రాధికారిచేసిన ప్రతి ఉత్తరువు అంతిమమైయుండును.

7. (1) కేంద్ర ప్రభుత్వం– తనిఖీ, సోదా, అభిగ్రహణ, నిరోధము, మరియు తొలగించుటకై అధికారముల నొసగుటకు నియమాలుచేయు అధికారము.

(ఏ) ఈ చట్టము క్రింద మంజూరైన లైసెన్సు క్రింద ఏదేని ప్రేలుడు వస్తువు తయారగుచున్న, స్వాధీనమునందుంచుకొనుచున్న, వాడుచున్న లేక విక్రయించుచున్న, రవాణా చేయుచున్న, దిగుమతి లేక ఎగుమతి చేయుచున్న లేక ఈ చట్టాన్ని గాని ఈ చట్టము క్రింద చేసిన నియమాన్నిగాని ఉల్లంఘించుచు ప్రేలుడు వస్తువు యొక్క తయారీ, రవాణా, ఎగుమతి, దిగుమతి చేయుట జరిగినదని, జరుగుచున్నదని స్వాధీనంలో ఉంచుకొనుట జరిగినదని లేక జరుగుచున్నదని, వాడుట జరిగినదని లేక జరుగుచున్నదని, విక్రయించుట జరిగినదని లేక జరుగుచున్నదని విశ్వసించుటకు అతనికి కారణమున్న ఏదేని స్థలంలో, వాయుయానము, బండి లేక జలయానములో ప్రవేశించి దానిని తనిఖీ చేయుటకు మరియు పరీక్ష చేయుటకు;

(బీ) దానిలో ప్రేలుడు వస్తువు కొరకు సోదా చేయుటకు;

(సీ) దానిలో దొరికిన ఏదేని ప్రేలుడు వస్తువు యొక్క మచ్చును దాని విలువ చెల్లించి తీసుకొనుటకు;

(డీ) దానిలో దొరికిన ఏదేని ప్రేలుడు వస్తువును లేక దాని సంఘటకమును అభిగ్రహించుటకు, నిరోధించుటకు, తొలగించుటకు, మరియు ఆవశ్యకమైనచో, అట్టి ప్రేలుడు వస్తువును, సంఘటకమును నాశము చేయుటకు కూడ,

ఎవరేని అధికారికి అతని పేరుతో గాని పదవినిబట్టి గాని ప్రాధికారము నొసగుచు,

ఈ చట్టమునకు అనుగుణంగా ఉండు నియమాలను చేయవచ్చును.

7. (2) క్రిమినలు ప్రక్రియా స్మృతి, 1973 క్రింది సోదాలకు సంబంధించి ఆ స్మృతిలోగల నిబంధనలు అవి వర్తింపదగియున్నంతమేరకు, ఈ పరిచ్ఛేదం క్రింది నియమాల ద్వారా ప్రాధికారమొసగిన అధికారులు చేయు సోదాలకు కూడ వర్తించును. 1974లో 2.

8. (1) ఏదేని ప్రేలుడు వస్తువును ఎవట తయారుచేయుచున్నారో స్వాధీనమునందు కలిగియున్నారో లేక వాడుచున్నారో ఆ స్థలంలో లేక దాని దగ్గర లేక దానికి సంబంధించి గాని ఏదేని ప్రేలుడు వస్తువును తీసికొనిపోవునట్టి లేక దేనిపై దానిని ఎక్కించుచున్నారో లేక దేనినుండి దానిని దించుచున్నారో ఆ వాయుయానము లేక బండి లేక జలయానములో లేక దాని దగ్గర లేక దానికి సంబంధించి గాని ప్రేలుడు వలన లేక అగ్నివలన దుర్ఘటన సంభవించి అందు మానవ ప్రాణ నష్టం లేక మానవ శరీరానికి లేక ఆస్తికి తీవ్రమైన హాని జరిగినపుడెల్లను లేక ఆ దుర్ఘటన మామూలుగా అట్టి నష్టాన్ని లేక హానిని కలిగించునటువంటిదైనపుడెల్లను, సందర్భానుసారంగ, ఆ స్థలం ఆక్రమణదారు లేక వాయుయానము లేక జలయానము యొక్క మాస్టరు లేక ఆ బండి బాధ్యతవహించు వ్యక్తి ఆ విషయాన్ని మరియు ఏదైన మానవ ప్రాణ నష్టం లేక శారీరక హాని జరిగినచో ఆ నష్టాన్ని లేక హానిని నియమం ద్వారా విహితము చేయునట్టి గడువు లోపల మరియు ఆ రీతిగా, దుర్ఘటనను గూర్చి తెలియజేయుట.

పేలుడు వస్తువుల ముఖ్య నియంత్రికునకు (చీఫ్ కంట్రోలరు) మరియు దగ్గరలో నున్న పోలీసు స్టేషను బాధ్యతవహించు అధికారికి తెలియజేయవలెను.

x x x x x x x x x

దుర్ఘటనల పరిశీలన.

9. (1) 8వ పరిచ్ఛేదంలో నిర్దేశించిన ఏదైన దుర్ఘటన, సంఘ సాయుధ బలముల నియంత్రణాధీనములోనున్న ఏదైన స్థలం, వాయుయానము లేక బండి లేక జలయానములో గాని దాని దగ్గర గాని దానికి సంబంధించి గాని జరిగిన యెడల, ఆ దుర్ఘటన కారణాలను గూర్చి సంబంధిత నౌకా, సైనిక, లేక వాయుసేన ప్రాధికారి పరిశీలన జరుపవలెను; అట్టి ఏదైన దుర్ఘటన ఏదేని ఇతర పరిస్థితులలో జరిగినయెడల, మానవ ప్రాణనష్టం జరిగిన కేసులలో జిల్లా మేజిస్ట్రేటు అట్టి పరిశీలన జరుపవలెను, లేక జరుపవలసినదిగా తనకు అధీనస్థుడైన ఎవరేని మేజిస్ట్రేటును ఆదేశించవలెను లేక ఏదైన ఇతర కేసులో అట్టి పరిశీలనను జరుపవచ్చును లేక జరుపవలసినదిగా తనకు అధీనస్థుడైన మేజిస్ట్రేటును ఆదేశించ వచ్చును.

(2) ఈ పరిచ్ఛేదం క్రింద పరిశీలన జరుపు ఏ వ్యక్తికైనను, క్రిమినలు ప్రక్రియా స్మృతి, 1973 క్రింద ఏదేని అపరాధమును పరిశీలన జరుపుటలో ఒక మేజిస్ట్రేటుకు గల అధికారములన్నియు ఉండును; అతడు 7వ పరిచ్ఛేదం క్రింది నియమాల ద్వారా ఎవరేని అధికారికి ఒసగిన అధికారాలలో ఆ పరిశీలన జరుపడానికి వినియోగించుట ఆవశ్యకమని లేక ఉపయుక్తమని అతడు భావించునట్టి అధికారాలను వినియోగించవచ్చును.

1974లో 2.

(3) ఈ పరిచ్ఛేదం క్రింద పరిశీలన జరుపు వ్యక్తి, ఆ దుర్ఘటనకు గల కారణాలను మరియు పరిస్థితులను తెలుపుచు కేంద్ర ప్రభుత్వానికి ఒక రిపోర్టు పంపవలెను.

(4) కేంద్ర ప్రభుత్వం ఈ క్రింది వాటి కొరకు నియమాలు చేయ వచ్చును, అవేవనగా:—

(ఏ) ఈ పరిచ్ఛేదం క్రింద పరిశీలనలు జరుపవలసిన ప్రక్రియను క్రమబద్ధం చేయుట;

(బీ) అట్టి ఏదైనా పరిశీలనలో హాజరగుటకు లేక తన ప్రతినిధిని పంపుటకు పేలుడు వస్తువుల ముఖ్య నియంత్రికునికి (చీఫ్ కంట్రోలరుకు) వీలు కలిగించుట;

(సీ) ఆ పరిశీలనలో సాక్షులనెవరినైనను పరీక్షించుటకై పేలుడు వస్తువుల ముఖ్య నియంత్రికునికి (చీఫ్ కంట్రోలరుకు) లేక అతని ప్రతినిధికి అనుజ్ఞ నొసగుట;

(డీ) అట్టి ఏదైన పరిశీలనలో పేలుడు వస్తువుల ముఖ్య నియంత్రికుడు (చీఫ్ కంట్రోలరు) హాజరుకానిచో లేక అతని ప్రతినిధిని పంపి యుండనిచో దాని చర్యల రిపోర్టును అతనికి పంపవలెనని నిబంధన చేయుట;

(ఈ) 8వ పరిచ్ఛేదంలో నిర్దేశించినట్లు తెలియజేయవలసినవి ఏ రీతిగా మరియు ఎంత కాలావధి లోపల తెలియజేయవలెనో విహితపరచుట.

మిక్కిలి తీవ్రమైన దుర్ఘటనల పరిశీలన.

9ఏ. (1) 9వ పరిచ్ఛేదం క్రింద పరిశీలన రిపోర్టు తనకు అందినను అందకున్నను, 8వ పరిచ్ఛేదంలో నిర్దేశించిన దుర్ఘటన కారణములను గూర్చి ఇంకను లాంఛనయుక్తమైన పరిశీలన జరుపవలెనని కేంద్ర ప్రభుత్వం అభిప్రాయ పడినయెడల, ఆ ప్రభుత్వం అట్టి పరిశీలన జరుపుటకై ప్రేలుడు వస్తువుల ముఖ్య నియంత్రకుని (చీఫ్ కంట్రోలరును) లేక ఎవరేని సమర్థుడైన ఇతర వ్యక్తిని నియమించవచ్చును; అట్టి పరిశీలనలో అసెస్సర్లుగా వ్యవహరించుటకు శాసన సంబంధమైన లేక విశేష పరిజ్ఞానం గల ఒక వ్యక్తిని లేక అంతకంటె ఎక్కువ మంది వ్యక్తులను కూడ నియమించవచ్చును.

(2) కేంద్ర ప్రభుత్వం ఈ పరిచ్ఛేదం క్రింద పరిశీలన జరుపవలెనని ఆదేశించినయెడల, వారు, ఆ సమయమున 9వ పరిచ్ఛేదం క్రింద జరుగుచున్న ఏదైన పరిశీలనను కొనసాగించరాదని కూడ ఆదేశించవచ్చును.

(3) ఈ పరిచ్ఛేదం క్రింద పరిశీలన జరుపుటకు నియమించిన వ్యక్తి, సాక్షులను తప్పనిసరిగా హాజరగునట్లు చేయుటకును దస్తావేజులు మరియు భౌతిక పదార్థములు తప్పనిసరిగా దాఖలుచేయునట్లు చేయుటకును, సివిలు ప్రక్రియా స్మృతి, 1908 క్రింద సివిలు న్యాయస్థానానికి గల అధికారాలన్నింటిని కలిగి యుండును; ఏదైన సమాచారాన్ని అందజేయుటకు పైన తెల్పిన వ్యక్తి కోరినట్టి ప్రతి వ్యక్తిని భారత శిక్షా స్మృతి యొక్క 176వ పరిచ్ఛేదపు అర్థంలో అట్లు అంద జేయుటకు శాసనరీత్యా బద్ధుడైయున్నట్లు భావించవలెను.

(4) ఈ పరిచ్ఛేదం క్రింద పరిశీలన జరుపు వ్యక్తి, ఎవరేని అధికారికి 7వ పరిచ్ఛేదం క్రింది నియమాల ద్వారా ఒసగిన అధికారాలలో ఆ పరిశీలన నిమిత్తం వినియోగించుట ఆవశ్యకమని లేక ఉపయుక్తమని తాను భావించునట్టి అధికారాలను వినియోగించవచ్చును.

(5) ఈ పరిచ్ఛేదం క్రింద పరిశీలన జరుపు వ్యక్తి, ఆ దుర్ఘటనకు గల కారణాలను, దాని పరిస్థితులను తెలుపుచు, తాను లేక అసెస్సర్లలో ఎవరైనను సబబని తలచు ఏవైన వ్యాఖ్యలను చేర్చి రిపోర్టును కేంద్ర ప్రభుత్వానికి పంప వలెను; కేంద్ర ప్రభుత్వం అట్లు పంపిన ప్రతి రిపోర్టును తాను సబబని తలచునట్టి సమయముననను అట్టి రీతిగాను ప్రచురింపజేయవలెను.

(6) ఈ పరిచ్ఛేదం క్రింది పరిశీలనలోని ప్రక్రియను క్రమబద్ధం చేయ డానికి కేంద్ర ప్రభుత్వం నియమాలు చేయవచ్చును.

కొన్ని అపరాధాలకు శిక్ష.

9-బి. (1) 5వ పరిచ్ఛేదం క్రింద చేసిన నియమాలను, లేక ఆ నియమాల క్రింద మంజూరైన లైసెన్సు షరతులను ఉల్లంఘించి—

(ఏ) ఏదేని ప్రేలుడు వస్తువును తయారుచేయు, దిగుమతిచేయు, లేక ఎగుమతిచేయు వారెవరైనను మూడు సంవత్సరాల దాక ఉండగల కాలావధికి కారావాసంతో, లేక అయిదువేల రూపాయల దాక ఉండగల జరిమానాతో, లేక ఈ రెండింటితోను శిక్షింపబడగియుందురు.

(బి) ఏదేని ప్రేలుడు వస్తువును స్వాధీనమునందుంచుకొను, వాడుచుండు విక్రయించు లేక రవాణాచేయు వారెవరైనను రెండు సంవత్సరాల దాక ఉండగల

కాలావధికి కారావాసంతో లేక మూడువేల రూపాయల దాక ఉండగల జరిమానాతో, లేక ఈ రెండింటితోను శిక్షింపదగియుందురు.

(సి) ఏదేని ఇతర సందర్భములో, ఒక వెయ్యి రూపాయల దాక ఉండగల జరిమానాతో శిక్షింపదగియుందురు.

(2) 6వ పరిచ్ఛేదం క్రింద జారీయైన అధిసూచనను ఉల్లంఘించి ఏదేని ప్రేలుడు వస్తువును తయారుచేయు, స్వాధీనమునందుంచుకొను, లేక దిగుమతి చేయు వారెవరైనను, మూడు సంవత్సరాల దాక ఉండగల కాలావధికి కారావాసంతో, లేక అయిదువేల రూపాయల దాక ఉండగల జరిమానాతో, లేక ఈ రెండింటితోను శిక్షింపదగియుందురు; ఒక ప్రేలుడు వస్తువును యుక్తమైన కారణం లేకుండా జలమార్గమున దిగుమతి చేసుకున్నప్పుడు ఏ జలయానములో దిగుమతి చేసుకొనడమైనదో ఆ జలయానపు సొంతదారు మరియు మాస్టరు లేక వాయుమార్గాన దిగుమతి చేసుకొన్నప్పుడు ఏ వాయుయానంలో దిగుమతి చేసుకొనడమైనదో ఆ వాయుయానపు సొంతదారు మరియు మాస్టరు, అయిదువేల రూపాయల దాక ఉండగల జరిమానాతో శిక్షింపదగియుండును.

(3) (ఏ) పరిచ్ఛేదం 6-ఏ లోని ఖండము (ఏ) యొక్క నిబంధనలను ఉల్లంఘించుచు ఏదేని ప్రేలుడు వస్తువును తయారుచేయు, విక్రయించు, రవాణా చేయు, దిగుమతి లేక ఎగుమతిచేయు లేక స్వాధీనమునందుంచుకొను వారెవరైనను, లేక

(బి) ఆ పరిచ్ఛేదంలోని ఖండము (బి) యొక్క నిబంధనలను ఉల్లంఘించుచు, ఏదేని ప్రేలుడు వస్తువును విక్రయించు, అందజేయు లేక పంపువారెవరైనను,

మూడు సంవత్సరాల దాక ఉండగల కాలావధికి కారావాసంతో లేక జరిమానాతో, లేక ఈ రెండింటితోను శిక్షింపదగియుందురు:

(సి) ఏదేని దుర్ఘటనను గూర్చి 8వ పరిచ్ఛేదపు నిబంధనలను ఉల్లంఘించుచు, తెలియజేయని వారెవరైనను,

(i) అయిదు వందల రూపాయలదాక ఉండగల జరిమానాతో, లేక

(ii) దుర్ఘటనలో మానవ ప్రాణ నష్టం జరిగినచో, మూడు మాసాల దాక ఉండగల కాలావధికి కారావాసంతో, లేక జరిమానాతో, లేక ఈ రెండింటితోను-

శిక్షింపదగియుందురు.

కంపెనీలచే అపరాధములు.

9-సీ. (1) ఈ చట్టము క్రింది అపరాధం ఒక కంపెనీ చేసినపుడెల్లను, ఆ అపరాధం జరిగినప్పుడు, ఆ కంపెనీ యొక్క వ్యాపార నిర్వహణ భారాన్నివహించిన లేక దానికై కంపెనీకి ఉత్తరదాయియైయుండిన ప్రతి వ్యక్తియును ఆ కంపెనీయు, ఆ అపరాధం చేసినట్లు భావించవలెను; మరియు తదనుసారంగ చర్యలు జరుపబడి శిక్షింపబడుటకు లోనుకావలెను:

అయితే, అట్టి ఎవరేని వ్యక్తి తనకు తెలియకుండ ఆ అపరాధం జరిగినదని మరియు అట్టి అపరాధ నివారణకై తగు జాగ్రత్త అంతయు తీసుకొనినట్లు

రుజువుచేసినచో, ఈ ఉపపరిచ్ఛేదంలో నున్నదేదియు అతనిని ఈ చట్టము క్రింద ఏ శిక్షకును పాత్రుని చేయదు.

(2) ఉపపరిచ్ఛేదం (1)లో ఏమియున్నప్పటికిని, ఈ చట్టము క్రింది అపరాధం ఒక కంపెనీ చేసియుండి ఆ అపరాధం ఆ కంపెనీ యొక్క ఎవరేని డైరెక్టరు, మేనేజరు, కార్యదర్శి లేక ఇతర అధికారి సమ్మతితో లేక మౌనానుకూలతతో జరిగినదని లేక వారి నిర్లక్ష్యం వలన ఆ అపరాధం జరిగినదని రుజువైన యెడల, అట్టి డైరెక్టరు, మేనేజరు, కార్యదర్శి లేక ఇతర అధికారి కూడ ఆ అపరాధం చేసినట్లు భావించవలెను, మరియు తదనుసారంగా చర్యలు జరుపబడి శిక్షింపబడుటకు పాత్రుడగును.

విశదీకరణ:- ఈ పరిచ్ఛేద ప్రయోజనముల కొరకు-

(ఏ) "కంపెనీ" అనగా ఏదేని నిగమనికాయం అని అర్థం, ఈ పదపరిధి యందు ఫర్మ, లేక వ్యక్తుల ఇతర అసోసియేషను చేరియుండును; మరియు

(బీ) ఒక ఫర్ముకు సంబంధించిన "డైరెక్టరు" అనగా ఆ ఫర్ములోని భాగస్వామి అని అర్థము.

10. ఎవరేని వ్యక్తి ఈ చట్టము క్రింద గాని ఈ చట్టము క్రింద చేసిన నియమాల క్రింద గాని శిక్షార్హమైన అపరాధానికై దోషస్థాపితుడైనపుడు, ఏ న్యాయస్థానం సమక్షంలో దోషస్థాపన జరిగినదో ఆ న్యాయస్థానం ఏ ప్రేలుడు వస్తువు విషయంలో ఆ అపరాధం చేయబడినదో ఆ వస్తువున్ను లేక ఆ పదార్థమును లేక ఆ ప్రేలుడు సంఘటకమును, లేక ఆ పదార్థము యొక్క ఏదైన భాగమును దానిని కలిగియుండు పాత్రలతోసహా సమపహారణం చేయవలెనని అతనిని ఆదేశించవచ్చును. ప్రేలుడు వస్తువుల సమపహరణ.

11. ఏదేని వాయుయానము లేక జలయానము యొక్క సొంతదారు లేక మాస్టరు, ఆ వాయుయాన లేక జలయానముపట్ల లేక దానికి సంబంధించి జరిగిన ఏదేని అపరాధమునకై జరిమానా చెల్లించవలెనని ఈ చట్టము క్రింద న్యాయ నిర్ణయం చేయబడినయెడల, జరిమానా తప్పనిసరిగా చెల్లించునట్లు చేయుటకు తనకు గల ఏదేని అధికారానికి అదనంగా, న్యాయస్థానం- వాయుయానము లేక జల యానము యొక్క కరస్థము.

(ఏ) ఆ వాయుయానమును మరియు దాని ఫర్నీచరును లేక ఆ జరిమానా చెల్లింపునకు అవసరమైనంత ఫర్నీచరును; లేక

(బీ) ఆ జలయానమును, మరియు అట్టి జలయానము యొక్క సరంజామాను (టాకల్), ఉపకరణములు మరియు ఫర్నిచరును, లేక ఆ జరిమానా చెల్లింపునకు అవసరమైనంత సరంజామా, ఉపకరణములు లేక ఫర్నిచరును,-

కరస్థంచేసి విక్రయించుట ద్వారా ఆ జరిమానాను వసూలు చేయవలెనని ఆదేశించవచ్చును.

12. ఈ చట్టము క్రింద గాని ఈ చట్టము క్రింద చేసిన నియమాల క్రింద గాని శిక్షింపదగిన ఏదేని అపరాధమును చేయుటకు భారత శిక్షా స్మృతి అర్థంలో దుష్ప్రేరణ మరియు ప్రయత్నాలు.

దుష్ప్రేరణచేయు, లేక ఏదైన అట్టి అపరాధమును చేయుటకు ప్రయత్నించి, అట్టి ప్రయత్నంలో దానిని చేయుటకు గాను ఏదేని కార్యమును చేయు ఏ వ్యక్తియైనను అతడు ఆ అపరాధమును చేసిన ఎట్లో అట్లే శిక్షింపబడును.

అపాయకరమైన అపరాధాలు చేయు వ్యక్తులను వారంటు లేకుండ అరెస్టుచేయు అధికారము.

13. ఈ చట్టము క్రింద లేక ఈ చట్టము క్రింది నియమాల క్రింద శిక్షింపదగియున్నట్టిదియు, ఏదేని పేలుడు వస్తువును తయారు లేక నిలువయుంచు ఏదేని స్థలంలో గాని, దానివద్ద గాని ఏదేని రైల్వే లేక ఓడరేవు లేక ఏదేని బండి, వాయుయానము లేక జలయానములో గాని, దాని వద్ద గాని పేలుడును లేక అగ్ని ప్రమాదమును కలిగించు ప్రవృత్తిగలదైనట్టి ఏదేని కార్యమును చేయుచున్నట్లు కనుగొనిన ఏ వ్యక్తినైనను, ఒక పోలీసు అధికారిగాని ఆ స్థలపు ఆక్రమణదారు లేక అతని ఏజెంటు, సేవకుడు లేక అతనిచే ప్రాధికారం పొందిన ఇతర వ్యక్తిగాని రైల్వే పాలకవర్గము యొక్క లేక ఓడరేవు కన్సర్వేటరు యొక్క లేక విమానాశ్రయపు బాధ్యతగల అధికారియొక్క ఎవరేని ఏజెంటు, సేవకుడు లేక దానిచే లేక అతనిచే ప్రాధికారం పొందిన ఇతర వ్యక్తిగాని వారంటు లేకుండ పట్టుకొనవచ్చును. అతనిని అరెస్టుచేసిన స్థలం నుండి తరలించి, వీలైనంత శీఘ్రంగా మేజిస్ట్రేటు సమక్షానికి తీసికొనిపోవచ్చును.

వ్యావృత్తి, మరియు మినహాయించు అధికారము.

14. (1) పరిచ్ఛేదములు 8,9 మరియు 9-ఏ తప్ప ఈ చట్టములో నున్నదేదియు ఏదైన పేలుడు వస్తువు–

(ఏ) కేంద్ర ప్రభుత్వం చేసిన నియమాలను లేక వినియమాల ననుసరించి సంఘము యొక్క ఏవేని సాయుధ బలములు, ఆర్డినెన్సు ఫ్యాక్టరీలు లేక అట్టి బలము యొక్క ఇతర సంస్థలచే,

(బీ) ఈ చట్టాన్ని అమలు జరుపుటలో కేంద్ర ప్రభుత్వం క్రింద, లేక రాజ్య ప్రభుత్వం క్రింద నియమింపబడిన ఎవరేని వ్యక్తి, తయారుచేయుటకు, స్వాధీనమునందుంచుకొనుటకు, వాడుటకు, రవాణా లేక దిగుమతి చేయుటకు వర్తించదు.

(2) కేంద్ర ప్రభుత్వం రాజపత్రంలో అధిసూచన ద్వారా, ఈ చట్టము యొక్క లేక ఈ చట్టము క్రింద చేసిన నియమాల యొక్క నిబంధనలన్నిటిలో నుండి గాని వాటిలో ఏవేని నిబంధనల నుండి గాని ఏదేని పేలుడు వస్తువును, ఎవరేని వ్యక్తిని లేక ఏదేని వర్గపు వ్యక్తులను బేషరతుగా గాని, విధించుట సబబని తాము భావించునట్టి ఏవేని షరతులకు లోబరచి గాని మినహాయించవచ్చును.

ఆయుధాల చట్టము, 1959 యొక్క వ్యావృత్తి. 1959లో 54.

15. ఈ చట్టములో నున్నదేదియు ఆయుధాల చట్టము, 1959 యొక్క నిబంధనలకు భంగము కలిగించదు:

అయితే ఏదైన పేలుడు వస్తువును తయారుచేయుటకు, స్వాధీనము నందుంచుకొనుటకు, విక్రయించుటకు, రవాణా లేక దిగుమతి చేయుటకు ఈ చట్టము క్రింద లైసెన్సు ప్రాధికారి, ఏ నియమాల క్రింద లైసెన్సు మంజూరు చేయనగునో ఆ నియమాల ద్వారా ఈ విషయంలో అధికారం పొందినచో, ఆ లైసెన్సు, సదరు ఆయుధాల చట్టము క్రింద మంజూరు చేసిన అదేమాదిరి లైసెన్సు యొక్క ప్రభావం కలిగియుండవలెనని ఆ లైసెన్సుపై వ్రాయు ఉత్తరువు ద్వారా ఆదేశించవచ్చును.

16. ఏ వ్యక్తియైనను ఈ చట్టానికి లేక ఈ చట్టము క్రింది నియమాలకు విరుద్ధమైన ఏదేని అపరాధమగునట్టి ఏదైన కార్యము లేక కార్యలోపము చేసినందుకు గాని, అతనిపై ఏదేని ఇతర శాసనం క్రింద అభియోగం తేబడుటను; లేక ఈ చట్టము ద్వారా లేక ఆ నియమాల ద్వారా నిబంధించిన దాని కంటె ఇతరమైన లేక అధికమైన శిక్షకు లేక శాస్తికి ఆ ఇతర శాసనం క్రింద అతడు పాత్రుడగుటను ఈ చట్టంలో నున్నదేదియు లేక ఈ చట్టము క్రింది నియమాల లోనిదేదియు నివారించదు: ఇతర శాసనం క్రింది దాయిత్వమును గూర్చి వ్యావృత్తి.

అయితే ఏ వ్యక్తియైనను ఒకే అపరాధానికి రెండుసార్లు శిక్షకు లోనుకారాదు.

17. ఏదైన పదార్థాన్ని దాని ప్రేలుడు తత్వాల కారణంగా గాని, దాని తయారీలోని ఏదైన ప్రక్రియ ప్రేలుడుకు గురియగునదైనందు వలన గాని ప్రాణానికి లేక ఆస్తికి విశేషంగా అపాయకరమైనదని కేంద్ర ప్రభుత్వానికి తోచినచో ఆ పదార్థాన్ని ఈ చట్టము అర్థంలో ఒక ప్రేలుడు వస్తువుగా భావించవలెనని కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు రాజపత్రంలో అధిసూచన ద్వారా ప్రఖ్యానించవచ్చును; మరియు (ఆ అధిసూచనలో నిర్దిష్టపరచిన మినహాయింపులు, పరిమితులు మరియు నిర్బంధనలకు లోబడి) ఈ చట్టపు నిబంధనలు ఆ ప్రకారమే ఆ పదార్థానికి అది ఈ చట్టములో "ప్రేలుడు వస్తువు" అను పదం యొక్క నిర్వచనంలో చేర్చియుండిన ఎట్లో అట్లే విస్తరించవలెను. "ప్రేలుడువస్తువు" నిర్వచనము ఇతర ప్రేలుడు పదార్థాలకు విస్తరించుట.

17-ఏ. కేంద్ర ప్రభుత్వం రాజపత్రంలో అధిసూచన ద్వారా పరిచ్ఛేదాలు 5,6,6-ఏ 14 మరియు 17 క్రింది అధికారాలు కానట్టివై, ఈ చట్టము క్రింద దానిచే వినియోగించదగు ఏదేని అధికారాన్ని లేక నిర్వర్తించదగు ఏదేని కృత్యాన్ని, ఆ అధిసూచనలో, అది నిర్దిష్టపరచునట్టి విషయాలకు సంబంధించి, అట్టి షరతులు ఏవైనా ఉన్నచో వాటికి లోబడి,- ప్రత్యాయోజనము చేయు అధికారము.

(ఏ) కేంద్ర ప్రభుత్వానికి అధీనస్థుడైన అధికారి లేక ప్రాధికారి, లేక

(బీ) అట్టి రాజ్య ప్రభుత్వం లేక రాజ్య ప్రభుత్వానికి అధీనస్థుడైనట్టి అధికారి లేక ప్రాధికారి,-

కూడ వినియోగించవచ్చునని లేక నిర్వర్తించవచ్చునని ఆదేశించవచ్చును.

18. (1) ఈ చట్టము క్రింద నియమాలు చేయు ప్రాధికారి, ఆ నియమాలను చేయుటకు పూర్వం, ప్రతిపాదిత నియమాల ముసాయిదాను, దాని వలన బహుశ: ప్రభావితులు కాగల వ్యక్తుల సమాచారం కొరకు ప్రచురించవలెను. నియమాలు చేయుటకు, ప్రచురించుటకు, ఖాయపరచుటకు ప్రక్రియ.

(2) దానిని, కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు రాజపత్రంలో అధిసూచన ద్వారా విహితం చేయు రీతిగా ప్రచురించవలెను.

(3) ఆ ముసాయిదాను ఏ తేదీన లేక ఏ తేదీ తరువాత పర్యాలోచించుట జరుగునో నిర్దిష్టపరచుచు ఒక నోటీసును ఆ ముసాయిదాతో ప్రచురించవలెను.

(4) నియమాలు చేయు ప్రాధికారి, అట్లు నిర్దిష్టపరచిన తేదీకి పూర్వం ఆ ముసాయిదాను గురించి ఏ వ్యక్తియైనను చేయు ఏవేని ఆక్షేపణలను గాని సూచనలను గాని స్వీకరించి పర్యాలోచించవలెను.

(5) ఈ చట్టము క్రింద చేసిన నియమాన్ని రాజపత్రంలో ప్రచురించు నంతవరకు అది అమలులోనికి రాదు.

(6) ఈ చట్టము క్రింద చేసినట్లు తాత్పర్యమగు నియమాన్ని రాజ పత్రంలో ప్రచురించుట, దానిని తగురీతిగా చేసినారనుటకును, దానికి మంజూరీ కావలసియున్నయెడల, దానిని తగురీతిగా మంజూరు చేసినారనుటకును నిశ్చాయక సాక్ష్యమైయుండును.

(7) నియమాలు చేయుటకై ఈ చట్టము ద్వారా ఒసగిన అధికారా లన్నింటిని సందర్భాన్నిబట్టి ఎప్పటికప్పుడు వినియోగించవచ్చును.

(8) ఈ చట్టము క్రింద చేసిన ప్రతి నియమాన్ని దానిని చేసిన పిమ్మట వీలైనంత శీఘ్రంగా, పార్లమెంటు యొక్క ప్రతి సదనం సమక్షంలో, అది అధివేశనంలో ఉన్నప్పుడు, మొత్తం ముప్పది దినముల కాలావధిపాటు ఉంచవలెను. ఆ కాలావధి ఒకే అధివేశనంలో గాని, రెండు లేక అంతకు మించి వరుసగావచ్చు అధివేశనాలలో గాని చేరియుండవచ్చును; మరియు పైన చెప్పిన అధివేశనానికి లేక వరుసగావచ్చు అధివేశనాలకు వెనువెంటనే వచ్చు అధివేశనం ముగియుటకు పూర్వం ఆ నియమంలో ఏదేని మార్పు చేయుటకు ఉభయ సదనాలు అంగీకరించినచో, లేక ఆ నియమాలు చేయరాదని ఉభయ సదనాలు అంగీకరించినచో, అటు పిమ్మట, ఆ నియమం అట్లు మార్పుచేసిన రూపంలో మాత్రమే అమలు కలిగియుండును. లేక సందర్భానుసారంగా అది ఎట్టి ప్రభావాన్ని కలిగియుండదు. అయినప్పటికిని, అట్టి ఏదేని మార్పుగాని రద్దుగాని, అంతకుపూర్వం ఆ నియమం క్రింద చేసియుండిన దేని శాసనమాన్యతకైనను భంగం కలిగించదు.